Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 143 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 12 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఏపీలో చంద్రబాబు పాలనపై మోదీ కితాబు



**న్యూఢిల్లీ:** ఏపీలో పాలనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు పాలన భేష్ అంటూ కితాబిచ్చారు. గురువారం ఉదయం ఏపీ, తెలంగాణ ఎన్డీయే ఎంపీలతో కలిసి ప్రధాని మోదీ అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీలో చంద్రబాబు పాలన చాలా బావుందని ప్రశంసించారు. పెట్టుబడులు కూడా ఏపీకి ఎక్కువగా వస్తున్నాయని ప్రధాని వెల్లడించారు. అయితే ఏపీలో పాలనను పొగడ్తలతో ముంచెత్తిన ప్రధాని.. తెలంగాణ బీజేపీ ఎంపీలపై మాత్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సరైన ప్రతిపక్ష పాత్ర పోషించలేకపోతున్నారని ఫైర్ అయినట్లు సమాచారం. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండాలని ఎంపీలకు ప్రధాని మోదీ హితవు పలికారు. ఈరోజు ఉదయం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీలకు ప్రధాని మోదీ అల్పాహార విందు ఇచ్చారు. ఎంపీలతో సుమారు అరగంట పాటు మోదీ మాట్లాడారు. ఏపీలో చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని, ఆయన పాలన కూడా బేషుగ్గా ఉందని కొనియాడారు. పూర్తి సమన్వయంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. చంద్రబాబు పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని ప్రధాని కితాబి చ్చారు. ఏపీకి ఎక్కువగా పెట్టుబడులు వెళ్తున్నాయని..ఇది శుభపరిణామమన్నారు. రాబోయే రోజుల్లో ఏపీ చాలా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రధాని పేర్కొన్నారు. అలాగే జగన్ పార్టీని, సోషల్ మీడియాలో ఆ పార్టీ చేస్తున్న విమర్శలకు బీజేపీ నేతలు కూడా ధీటుగా కౌంటర్ ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. అటు తెలంగాణలో ఓవైసీ సోషల్ మీడియా కంటే బీజేపీ సోషల్ మీడియా చాలా తక్కువగా ఉందని, బీజేపీ నేతలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఎందుకు ఉండటం లేదని తెలంగాణ బీజేపీ ఎంపీలపై ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయని, కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా సరిగ్గా పోషించడం లేదని ఎంపీలపై మండిపడినట్లు తెలుస్తోంది. మంచి టీమ్‌ను పెట్టుకుని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఉన్నా కూడా సమస్య ఏంటి అని ప్రశ్నించినట్లు సమాచారం. తెలంగాణలో పార్టీ పెరగడానికి మంచి అవకాశం ఉన్నప్పటికీ దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలం అవుతున్నారని ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

## ఇండిగో కీలక నిర్ణయం.. ఆ ప్రయాణికులకు బంపర్ ఆఫర్.!





**ఇంటర్నెట్ డెస్క్:** కొన్ని రోజులుగా తీవ్ర సంక్షోభంలో ఇరుక్కున్న దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. పరిస్థితులు ఇప్పుడు దాదాపు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల.. ఇండిగో ఫ్లైట్ సర్వీసులు రద్దు కావడంతో ఇబ్బంది పడిన ప్రయాణికులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. వారికి పరిహారం కింద రూ.10 వేల విలువైన ట్రావెల్ ఓచర్ అందిస్తామని స్పష్టం చేసింది. ఇండిగో సంస్థకు చెందిన వందలాది విమానాలు ఒక్కసారిగా రద్దవడంతో ఈనెల 3, 4, 5 తేదీలలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేల మంది ప్రయాణికులు ఎయిర్‌పో ర్టుల్లో చిక్కుకుని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో వారికి ఉపశమనం కలిగిస్తూ.. పరిహారం చెల్లించే దిశగా ముందడుగేసింది ఇండిగో. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా బాధిత ప్రయాణికులకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకూ ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్టు పేర్కొంది. రద్దైన విమానాల కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరిన ఇండిగో.. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకుంటామంది. కంపెనీ అందించే ఈ ట్రావెల్ ఓచర్ విలువ రూ.10 వేల వరకూ ఉండనుంది. రానున్న 12 నెలల్లో తమ సంస్థకు చెందిన ఫ్లైట్లలో ప్రయాణించేందుకు వీటిని ఉపయోగించుకోవచ్చని తెలిపింది ఇండిగో. అయితే.. ఏయే ప్రయాణికులకు ఎంత మేర పరిహారం కింద చెల్లిస్తారనే వివరాలపై ఇంకా స్పష్టత రాలేదు.

## లోయలో పడ్డ ట్రక్కు.. 22 మంది కార్మికులు మృతి



**అరుణాచల్‌ప్రదేశ్ :** దేశంలో ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అనుభవం లేకుండా క్లీనర్లు వాహనాలు నడపడం ఇలా ఎన్నో కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇండో – చైనా సరిహద్దు వెంబడి ఉన్న హుయులియాంగ్ – చగ్లగామ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. అస్సోంలోని టిన్సుకియా జిల్లాకు చెందిన రోజువారి కూలీలను తీసుకువెళ్తున్న ఓ ట్రక్కు మార్గమధ్యలో ఈ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ఉన్న 22 మంది కూలీలు చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. వాస్తవానికి ఈ ఘటన సోమవారం అంటే మూడు రోజుల క్రితం జరిగింది. ఈ ప్రమాదం నుంచి ఓ కార్మికుడు గాయాలతో బయటపడి పట్టణానికి చేరుకున్నాడు. అతడు ఇచ్చిన సమాచారం వల్లనే ఈ విషాద ఘటన గురించి పోలీసులకు తెలిసింది. గాయపడ్డ ఆ కార్మికుడి మెరుగైన చికిత్స కోసం అస్సాంకు తరలించారు. ప్రమాద ఘటన గురించి అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కొజిన్ ధృవీకరించారు. ఈ ప్రమాదంపై మాట్లాడుతూ.. ఈ ఘటన అంతర్జాతీయ సరిహ ద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి దాదాపు 10 వేల అడుగుల ఎత్తులో ఉందన్నారు. ఇప్పటి వరకు 17 మృతదేహా లను వెలికి తీసినట్లు తెలిపారు. రెస్క్యూ టీమ్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మిలో కొజిన్ వెల్లడించారు.

## గడువు పొడిగింపు కోసం ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆహ్వానం

**విజయవాడ, (రాజధాని వార్తలు):** 2026-2027 విద్యా సంవత్సరం కోసం ఆంధ్రప్రదేశ్ ఇంటర్ విద్యా మండలి అఫిలియేషన్ కోసం రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్/ఎయిడెడ్ జూనియర్ కళాశాలలచే లేదా తాత్కాలిక అనుబంధం గడువు ముగిసిన నిర్వాహకుల కోసం అదనపు సెక్షన్స్ సహా తాత్కాలిక అనుబంధం పొడిగింపు కోసం ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా తెలియజేసారు. ఇతర వివరాల కోసం బోర్డ్ వెబ్ సైట్ http:// bie.ap.gov. in ను చూడగలరు. చివరి తేదీ 28-02-2026.

## ఏపీ కేబినెట్.. రూ.9,500 కోట్ల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి.. నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 44 అజెండా అంశాలతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. రూ.9,500 కోట్లతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించిన ప్రాజెక్టులు, అమరావతిలో లోక్ భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్ నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా గవర్నర్ కార్యాలయం, గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి మంత్రివర్గ సమావేశంలో చర్చించి అంగీకారం తెలిపారు. అలాగే పలు సంస్థలకు భూకేటాయింపులకు కేబినెట్ అనుమతి ఇచ్చింది.

## దేశంలో మొదటి క్వాంటం కంప్యూటర్ అమరావతిలోనే..

**అమరావతి, (రాజధాని వార్తలు):** 44 అంశాలపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఏపీ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు. అమృత్ 2 లో భాగంగా 2026 మార్చి 31 కల్లా పెండింగ్ పనులు ప్రారంభించాలని కేంద్రం స్పష్టం చేసిందని.. అమృత్ 2లో భాగంగా 506 పెండింగ్ ప్రాజెక్టులను రూ.9,613 కోట్ల నిధులతో చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింద న్నారు. రూ.163 కోట్లతో అమరావతిలో లోక్ భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. ఎల్ 1 బిడ్లను ఆమోదించే బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమరావతిలో E 3 రోడ్డు విస్తరణకు ఎల్ 1 బిడ్ ఆమోదానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎండీకి బాధ్యతలు అప్పగించామన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో పలార్ నదిపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.15.96 కోట్ల నిధులను పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించిందన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 417 టీచర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసే ప్రతిపా దనకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సాంఘిక సంక్షేమం విభాగంలో సామాజిక సేవలో అనుభవం ఉన్న వ్యక్తులను చైర్మన్లు, మెంబర్లుగా నియమించే ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పిందన్నారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా కీలక ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 3057 మందికి క్వాంటం అప్లికేషన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం చెప్పిందని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన 11 సంస్థల ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని మంత్రి పార్థసారథి తెలిపారు. క్వాంటం కంప్యూటర్లు తయారు చేయడం కోసం ముందుకు వచ్చిన పలు సంస్థల ప్రతిపాదనలకు, అలాగే క్వాంటం కంప్యూటింగ్‌లో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. ఇటీవల ఎస్ఐపీబీ సమావేశంలో తీసు కున్న పలు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సంస్థలకు సంబంధించి 20267 కోట్ల రూపాయల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచడాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్టా త్మకంగా తీసుకున్నారన్నారు. విద్యుత్ చార్జీలను రూ. 5.12 నుంచి 4 రూపాయలకు తీసుకురావాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. దీనికోసం రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పలు సంస్థల ప్రతిపాదనలను





కేబినెట్ ఆమోదించిందన్నారు. కృష్ణపట్నం పోర్టులో 4731 ఎకరాలు మల్టీ ప్రొడక్ట్ సెజ్ ఏర్పాటు కోసం 2010లో ల్యాండ్ కొనుక్కున్నారని.. అక్టోబర్ 2019లో గత ప్రభుత్వం ఈ భూకేటాయింపులను రద్దు చేసిందన్నారు. దీన్ని కోర్టు కొట్టి వేయడం వల్ల ప్రాజెక్టు పదేళ్లు ఆలస్యమైనందున పెనాల్టీని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. 3 ఏళ్లలో తొలిదశ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించాలని సమయం ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మహిళల ప్రపంచ కప్ గెలుపులో విశేష ప్రతిభ చూపిన రాష్ట్ర క్రీడాకారిణి శ్రీ చరణికి ప్రోత్సాహకం ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు, విశాఖపట్నంలో 500 గజాలు ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్థసారథి చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. పీఎం సూర్యఘర్ కింద ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు అదనంగా సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల అదనపు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం కలిన బీసీ వినియోగదారులకు రూ.20 వేల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రూ.5445 కోట్ల అంచనా బడ్జెట్‌తో పీఎం సూర్యఘర్ ప్రాజెక్టును రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రి వర్గంలో నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ విషయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సీఎం తెలిపారన్నారు. ఏడాది కాలంలోనే రెవెన్యూ సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరించాలని రెవెన్యూ విభాగాన్ని సీఎం ఆదేశించారని తెలిపారు. 22 ఏ, మ్యుటేషన్, రీ సర్వే సమస్య లన్నింటినీ పూర్తిగా పరిష్కరించాలని.. ఆపై రెవెన్యూ రికార్డులన్నింటినీ బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్‌లో సేవ్ చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు. తద్వారా రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

## వైసీపీవి పిచ్చి ప్రేలాపనలు : ఎమ్మెల్యే యార్లగడ్డ



**అమరావతి, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం రివ్యూ మీటింగ్‌లు పెడుతూ రాష్ట్రాన్ని రావణ కాష్టం నుంచి గట్టెక్కించి మళ్లీ గాడిలో పెట్టడానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో దాదాపు 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి వారి కెరీర్‌కు భరోసా ఇచ్చారన్నారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో చెప్పినట్లుగా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. గత అమెరికా పర్యటనలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఒక్క రోజు మాత్రమే చేసి మిగతా రోజుల్లో పరిశ్రమల కోసమే కృషి చేశారని చెప్పుకొచ్చారు. లోకేష్ ఇటీవల మూడు రోజుల్లోనే గూగుల్, NVIDIA, ఆడోబ్, ఇన్‌టెల్, ఓపెన్ ఏఐ సహా దాదాపు 18 ప్రపంచ దిగ్గజ కంపెనీల సీఈఓలతో సమావేశమై పెట్టుబడుల కోసం రాష్ట్రానికి ఆహ్వానించారన్నారు. భారత జీడీపీ ($4.19 ట్రిలియన్) కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ($4.6 ట్రిలియన్) ఉన్న NVIDIA కంపెనీతో కూడా చర్చలు జరుపుతున్నారని తెలిపారు. అంతర్జాతీయ కంపెనీల యజమానులతో లోకేష్ సమావేశం కావడం జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు కేవలం ఈర్ష్యతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఆ నగరాన్ని నేడు 2 లక్షల 90 వేల కోట్ల ఐటీ ఎగుమతులు చేసేలా చేసింది చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. ఆయనే స్ఫూర్తితో లోకేష్ బాబు గూగుల్‌ను వైజాగ్‌కు తీసుకొచ్చి ఆ నగరాన్ని పెట్టుబడుల స్వర్గధామం చేయబోతున్నారని అన్నారు. వైసీపీ మంత్రులు తమ హయాంలో ఎన్నిసార్లు రివ్యూ మీటింగ్‌లు పెట్టారో గణాంకాలతో చర్చకు రావాలని సవాల్ చేశారు. లోకేష్ బాబు తన వ్యక్తిగత పర్యటనలకు సొంత నిధులు వాడుతున్నారు తప్ప, ప్రభుత్వ డబ్బు వాడుకోవడం లేదని తెలిపారు. లోకేష్ ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని ఛాలెంజ్ చేశారు. ఓటమి తర్వాత కౌంటింగ్ సెంటర్ నుంచి వెళ్లిపోయి ఏడాది పాటు గుడివాడ మొహం చూడకుండా దాక్కున్న నాయకుడు ప్రజాతీర్పును గౌరవించలేదంటూ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలు చేశారు.

# కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం గ్రాండ్ సక్సెస్

## - 73 వేల సంతకాలు సేకరించి దిగ్విజయం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు - కోటి సంతకాల సేకరణ వాహనాన్ని జిల్లా పార్టీ కార్యాలయానికి జెండా ఊపి ప్రారంభించిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో పూర్తి చేసిన సంతకాల కాపీల వాహనాన్ని.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పార్టీ పరిశీలకులు చిలకలూరు సుధీర్ రెడ్డి జెండా ఊపి జిల్లా పార్టీ కార్యాలయానికి పంపారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి వాహనం వెంట ర్యాలీగా తరలి వెళ్లారు. రాంజీ నగర్ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నేతల భారీ జన సందోహం మధ్య సాగిన ర్యాలీ ధర్మాధపురం సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గంలో దిగ్విజయంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. నగర నియోజకవర్గంలో అన్ని వార్డులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి గడపకు వెళ్లడం జరిగిందన్నారు. కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ..ప్రజలు పార్టీలకతీతంగా ముందుకొచ్చి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి మద్దతు పలికారని తెలిపారు.

ఇప్పటికే కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విసిగిపోయిన ప్రజలు కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని ముందుండి నడిపించారని తెలిపారు. కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో భాగంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరణ దిశగా ముందుకెళ్తే 73 వేల పైచిలుకు సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో కోటి సంతకాల సేకరణ డేటాను డిజిటలైజ్ చేయడం కూడా జరిగిందన్నారు. ఈరోజు నెల్లూరు నగర నియోజకవర్గంలో సేకరించిన సంతకాల కాపీల బాక్సులను భారీ ర్యాలీ కార్యకర్తలు జన సందోహం మధ్య జిల్లా ఆఫీసుకు తరలించామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా కోటి 20 లక్షల మంది ప్రజలు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో పాల్గొన్నారని స్వాతంత్రం వచ్చిన తర్వాత ఏ ఉద్యమంలో కూడా ఇంత పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనలేదన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి ఒకటి ప్రైవేటుపరం చేస్తూ తమ సొంత వ్యక్తులకు ప్రభుత్వ ఆస్తులను కూటమి నేతలు దారాదత్తం చేయడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఈరోజు సామాన్య ప్రజలను గాలి కొదిలేసి కూటమి ప్రభుత్వం దుర్మార్గపు పాలన సాగిస్తుందన్నారు. నెల్లూరు నగరంలో పరిస్థితిని ఒకసారి గమనించినట్లయితే గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్స్ విచ్చలవిడిగా తిరుగుతూ ప్రశ్నించిన వారిపై కత్తులు, బ్లేడ్లతో దాడి చేసి హతమార్చడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా ముందుకొచ్చి మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని తమ భుజాన వేసుకొని విజయవంతం చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. పార్టీ నేతలు కార్యకర్తలు ప్రతి ఒక్కరికి అండగా ఉం టుందని తెలియజేశారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతానని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఈరోజు పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతున్న కార్యకర్తలకు సముచిత గౌరవం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్‌లో సంతకాలు సేకరణ విజయవంతం











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 12వ డివిజన్, చింతారెడ్డిపాళెంలోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ కార్యాలయం నందు సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ పత్రాలను పార్టీ జిల్లా కార్యాలయంకి ర్యాలీగా తరలించారు. కార్యక్రమానికి భారీగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ జండా ఊపి సంతకాలు సేకరణ పత్రాలు తరలించే వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ 18 గ్రామాలు, 26 డివిజన్లో 60 వేలకు పైగా సం తకాలు సేకరించడం జరిగింది. సంతకాల సేకరణలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడంపై ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ప్రైవేటీకరణ జరగకుండా ప్రభుత్వంపై వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తీసుకొస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జరగనివ్వం. సంతకాల సేకరణకు సహకరించిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులకు మరియు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియో జకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ ఇన్చార్జులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం మరియు నెల్లూరు రూరల్ మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫైల్స్ క్లియరెన్స్‌లో నెల్లూరు జిల్లాకు రెండో స్థానం

## - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను ప్రత్యేకంగా అభినందించిన సీఎం చంద్రబాబు నాయుడు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫైళ్లను వేగంగా పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రెండోస్థానంలో నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఫైళ్లను త్వరగా పరిష్కరించడంలో కలెక్టర్ల పనితీరుకు సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం ర్యాంకులు ప్రకటించారు. సెప్టెంబర్ 9 నుంచి డిసెంబర్ 9 వరకు మూడు నెలల్లో ఈ-ఫైల్స్ క్లియరింగ్ లో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మొదటి స్థానంలో ఉండగా, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ద్వితీయ స్థానంలో, విజయనగరం జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లాలో గడిచిన మూడు నెలల్లో వివిధ శాఖల నుంచి 682 ఫైల్స్ రాగా 628 ఫైళ్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల క్లియర్ చేశారు. ఈ మేరకు సీఎం కలెక్టర్ హిమాన్షు శుక్లను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం సూచించారు.

# అనాథాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు



**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలోని ఒంపిల్లి గ్రామంలో గల శాంతి నివాస్ అనాధాశ్రమానికి బుధవారం సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం బ్యాగ్, గుడ్లు, స్నాక్స్ ఐటమ్స్‌ను అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు బలివాడ అక్షయ్ పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని పిల్లల కోసం ఐటమ్స్‌ను అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యుల పుట్టినరోజున తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధాశ్రమాలలో అన్నదానం, వస్త్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు బి. రమ్య, సభ్యుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# గజపతినగరంలో స్క్రబ్ టైపస్ కేసు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం స్క్రబ్ టైపస్ కేసు నమోదు అయింది. బొండపల మండలం మరువాడ గ్రామానికి చెందిన ప్రియ అనే నాలుగేళ్ల చిన్నారినీ మూడు రోజులుగా జ్వరం పట్టి పీడిస్తుంది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు బుధవారం గజపతి నగరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చిన్నారిని తీసుకువచ్చారు. చిన్నారికి రాపిడ్, ఎలిసా పరీక్షలు చేపట్టగా, టెస్టులు రెంటింటి లోనూ పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు చిన్నారికి ఆసుపత్రిలోనే వైద్యం చేపడుతున్నారు. ప్రియ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు.



# పోలీసు స్టేషన్‌లను సందర్శించిన గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నవాబ్ పేట, సంతపేట మరియు బాలాజీ నగర్ పోలీసు స్టేషన్‌లను సందర్శించిన గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి, ఐపిఎస్. నవాబ్ పేట, సంతపేట మరియు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌ను గుంటూరు రేంజ్ ఐజి, జిల్లా యస్.పి. డా.అజిత వేజెండ్ల, ఐపిఎస్ పాటు కలిసి సందర్శించడం జరిగినది. పోలీసు స్టేషన్‌ల మ్యాప్‌లను పరిశీలిస్తూ, స్టేషన్స్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఆరా. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులు, క్రైమ్ రికార్డుల పరిశీలించిన ఐ.జి. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీ ఉండదు. జిల్లాను పూర్తిగా నేరరహితంగా, ప్రజలు యథావిధిగా ప్రశాంతంగా జీవించగల వాతావరణం ఉండుటకు తగిన చర్యలు. యాక్టివ్ రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి. ఎలాంటి రౌడీ మూకలు శాంతి భద్రతలకు భంగం కలిగించినా క్షమించేది లేదు.

క్రైమ్ ప్రోన్ ప్రాంతాలలో నిరంతర నిఘా, ప్రత్యేక బృందాల పర్యవేక్షణ కొనసాగుతుంది. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, క్రిమినల్ కార్యకలాపాల నుంచి దూరంగా ఉండేలా మార్గనిర్దేశనం. పునరావృత నేరాలు చేసే రౌడీలు, గ్యాంగ్ సభ్యులపై పిడి యాక్ట్ వర్తింపజేస్తాం. నేరాలకు పాల్పడిన వారి ఆస్తులను కూడా సీజ్ చేసే విధంగా దర్యాప్తు కొనసాగిస్తామని హెచ్చరిక. పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యలు సృష్టించే రౌడీలను పోలీసులు పెరేడ్ చేయిస్తారు. ప్రజల మధ్య రోడ్లపై నడిపిస్తూ వారి క్రిమినల్ ప్రవర్తనను అరికట్టే దిశగా తగిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం, నేరాల విచారణలో పారదర్శకత, రెస్పాన్స్ టైమ్ తగ్గించడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్‌లను గురించి, రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులతో పాటు పట్టణ, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు. పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధమ కర్తవ్యం... పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క యోగ క్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా? వారి యొక్క గ్రీవెన్స్‌ను అడిగి, వెంటనే పరిష్కరించేలా ఆదేశాలు. ఈ తనిఖీలో ఐ.జితో పాటు జిల్లా యస్.పి., సంబంధిత డిఎస్పీ, సిఐ, ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రీ క్రిస్మస్ సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్న ఆనం విజయకుమార్ రెడ్డి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 30వ డివిజన్ మల్లయ్య గుంట నందు కాలేబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ సంబరాలు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ ఇంచార్జ్ నారాయణ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు అయిరెడ్డి సుబ్బారెడ్డి, జిల్లా పబ్లిక్ సిటీ విభాగ ప్రధాన కార్యదర్శి అక్కి చంద్రారెడ్డి, 32వ డివిజన్ ఇంచార్జ్ సయ్యద్ ముజాఫర్, జిల్లా యువజన విభాగ కార్యదర్శి షేక్ ఆరిఫుల్ల హుసేని, జిల్లా ట్రేడ్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, నాయకులు చంద్ర, మోహన్, ముత్తంగి రామయ్య, షేక్ కాజా, సుభాని, మస్తాన్, పెంచలయ్య, ఢిల్లీ రావు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లిలో కోలాహాలంగా కోటి సంతకాల సేకరణ









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారీగా తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు. బాణాసంచా పేలుళ్లతో, జై జగన్ నినాదా లతో దద్దరిల్లిన సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రం.

కోటి సంతకాల ర్యాలీ ముందు మహానేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించిన వైయస్సార్సీపీ శ్రేణులు. కోటి సంతకాల పత్రాలను ప్రజల ముందు, మీడియా ముందు ప్రదర్శన

సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రం నుండి కోటి సంతకాల పత్రాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన కాకాణి పూజితమ్మ. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం చేయడంతో పాటు, భారీగా తరలి వచ్చి, కోటి సంతకాల వాహనం వెంబడి ర్యాలీలో పాల్గొన్న వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన కాకాణి పూజిత, కాకాణి గోవర్ధన్ రెడ్డి.

# 6వ డివిజన్‌లో విజయవంతంగా పూర్తి చేసిన కోటి సంతకాల సేకరణ

## - పూర్తి చేసిన 2100 కాపీలను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేసిన డివిజన్ నేతలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని వైసీపీ 6వ డివిజన్ నేతలు కలిసి..కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాలు పూర్తి చేసిన 2100 కాపీలను పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. డివిజన్ ప్రజల సహకారంతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామని వారు చంద్రశేఖర్ రెడ్డికి తెలిపారు.

ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన డివిజన్ నేతలు మాదాల నరేంద్ర, అడపా శ్రీధర్, తానేష, తులసి, శ్రీహరి, నాగమణి, సుభాషిని, ఖాదర్ బాషా, నవీన్, వాణి, హర్ష, బాలకృష్ణ యాదవ్‌ను చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.

# 47వ డివిజన్‌లో విజయవంతంగా పూర్తి చేసిన కోటి సంతకాల సేకరణ

## - పూర్తి చేసిన 2000 కాపీలను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేసిన డివిజన్ నేతలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మరియు 47వ డివిజన్ వైసిపి సీనియర్ నాయకులు మజ్జిగ జయకృష్ణ రెడ్డి డివిజన్ నేతలతో కలిసి..కోటి సంతకాల సేకరణలో సంతకాలు పూర్తి చేసిన 2000 కాపీలను పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. డివిజన్‌లో ప్రజలు అందిస్తున్న మద్దతుతో రెట్టింపు ఉత్సాహంతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామని వారు చంద్రశేఖర్ రెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన డివిజన్ నేతలు ఇలపాక శివాచారి, శివపురం సురేష్, శంఖర్, వెంకట శేషయ్య ఆచారి, సాదా గోపి, శివాణిను చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

# కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిమ్మ రైతులకు ఊరట

## - జిల్లాలో నిమ్మ రైతులను ఆదుకునేందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

## - శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి మన జిల్లాలోని నిమ్మ కొనుగోలు చేసేలా చర్యలు - వెంటనే నిమ్మను ఆయా జిల్లాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో నిమ్మ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిమ్మ ధరలు తగ్గిన నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ఉద్యానవన మార్కెటింగ్ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 35,000 ఎకరాల్లో నిమ్మ సాగు చేపట్టారని, ఇందులో ఈ సీజన్లో 25 వేల ఎకరాలు కాపునకు వస్తున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో నిమ్మ విస్తీర్ణం బాగా పెరిగినందున మన ప్రాంతం నుంచి పంపించే నిమ్మకు డిమాండ్ తగ్గడంతో ధరలు కూడా తగ్గాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మన రాష్ట్రంలో నిమ్మ డిమాండ్ ఉన్న కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లకు సమావేశం నుంచే ఫోన్ చేసి మాట్లాడారు. నెల్లూరు జిల్లా నుంచి నిమ్మ పంటను ఆయా జిల్లాల్లో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరగా, ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఇందుకు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు మన జిల్లా నుంచి నిమ్మ పంటను వెంటనే ఆయా జిల్లాలకు పంపించి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డిమాండ్ ఉన్న ఇతర జిల్లాలతో కూడా సంప్రదించాలని అధికారులను ఆదేశించారు. నిమ్మ రైతులు నష్టపోకుండా వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# కరాటేలో శిక్షణ పొందుతూ ధ్యానం చేస్తున్న విద్యార్థినిలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరాటే ఇన్స్ట్రక్టర్ ఇచ్చి బాలికలకు కరాటేలోని మెలకువలను ఏదైనా అటాక్స్ జరిగినప్పుడు తిరిగి ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలను వారి నుండి నేర్చుకోవడం జరిగింది అలాగే చివర్లో అందరూ ధ్యానం చేయడం కూడా జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కాంతారావు ఈ విషయాన్ని తెలియజేశారు.

# సంపాదకీయం

## తిరోగమిస్తున్న భారత ప్రజాస్వామ్యం

నీవు 'దేశ్, కాల్, పత్ర' గురించి మాట్లాడుతున్నావు కదూ అని నా మిత్రుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ విజయ్ మహాజన్ వ్యాఖ్యానించారు. అవును, దేశ్ (నియోజకవర్గ సరిహద్దులు), కాల్ (ఎన్నికల సమయం), పత్ర (ఓటర్ల జాబితా) మార్చడం గురించి నేను మథనపడుతున్నాను. మన ఎన్నికల వ్యవస్థలో సంభవించనున్న మూడు పెనుమార్పులను సూచిస్తున్న విషయాలవి. మహాజన్‌తో జరిగిన మాటామంతీతో డీ-లిమిటేషన్ (2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన), వన్ నేషన్, వన్ టైమ్ (ఒక దేశం, ఒక ఎన్నిక (పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ), ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్) మధ్య పరస్పర సంబంధమూ, అది జాతీయ అధికార పక్షానికి సమకూర్చే శాశ్వత నిర్మాణాత్మక ప్రయోజనం గురించి నాకు మరింత మెరుగైన అవగాహన ఏర్పడ్డది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే మంగళవారం లోక్‌సభలో, బుధవారం రాజ్యసభలో 'ఎన్నికల సంస్కరణల'పై చర్చ జరిగింది. ఎన్నికల సంస్కరణ అనేది అందమైన భావన. అది గతించిన ఒక అమాయక కాలాన్ని గుర్తుచేస్తుంది. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లకు నచ్చజెప్పి, వారిని ఒప్పించడం సాధ్యమయ్యే నిష్కపటత్వం ఉన్న రోజులవి. అయితే యమునా నదిలో నాటికీ నేటికీ చాలా మురికినీరు ప్రవహించింది సుమా! ఎన్నికల వ్యవస్థలో ఆవశ్యక మార్పుల విషయమై 'ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్' పద్ధతి (ఓటర్లు ఒకే అభ్యర్థికి ఓటు వేసే బహుళ ఓటింగ్ వ్యవస్థ. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి విజేత అవుతాడు) నుంచి దామాషా ప్రాతినిధ్యానికి మారే విషయమై చర్చించాం. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకు రావాల్సిన చట్టాల గురించీ తర్జన భర్జనలు పడ్డాం. చివరకు ఇప్పుడు ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత కనీసంగానైనా ఉండేలా తీసుకోవల్సిన జాగ్రత్తలు మొదలైన అంశాల గురించి తర్కిస్తున్నాం. నిజానికి ఎన్నికల 'సంస్కరణల' గురించి కాకుండా ప్రస్తుత పాలకుల విధానాల వల్ల ఎన్నికల వ్యవస్థలో సంభవిస్తోన్న వికృతాలను నిరోధించే విషయమై పార్లమెంటు చర్చించడం యుక్తంగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. ఎన్నికలలో అక్రమాలు సంభవించడమనేది భారత్‌కే పరిమితమైన పరిణామం కాదు. ఎన్నికల నిర్వహణా నియమాలను నిరంకుశ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకోవడమనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. ఇరవయో శతాబ్ది నియంతలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అయితే 21వ శతాబ్ది నిరంకుశ పాలకుల పరిస్థితి వేరు. తమకు ప్రజల మద్దతు పూర్తిగా ఉన్నదని చూపాల్సిన అవసరం వీరికి ఉన్నది. కనుకనే ఎన్నికలను పూర్తిగా రద్దు చేయలేకపోతున్నారు. అలా అని ఎన్నికలు నిర్వహించి తమ అధికారానికి ప్రమాదాన్ని కొనితెచ్చుకోలేరు. అందుకే రెండు కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఒకటి- ఎన్నికలు నిర్వహించే రాజ్యాంగ సంస్థను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారుబీ రెండోది రాజకీయ పోటీని యథాతథంగా ఉంచుతూ ఎన్నికల నియమాలు పూర్తిగా పాలకులకే అన్ని విధాలా అనుకూలంగా ఉండేలా చేస్తున్నారు. సమకాలీన ప్రపంచంలో హంగేరీ, తుర్కియే, వెనిజువెలా, ఈక్వెడార్, బొలీవియా, కెన్యా, థాయిలాండ్, మయన్మార్ మొదలైన దేశాల తులనాత్మక రాజకీయాల పరిశోధకులు నిగ్గుదేల్చిన 'దుర్వినియోగ రాజ్యాంగవాదం' (అబ్యూసివ్ కాన్స్టిట్యూషనలిజమ్ - ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు, నిరంకుశ పాలనను నెలకొల్పేందుకు రాజ్యాంగ విధానాలను అనుసరించడం), 'నిరంకుశ చట్టబద్ధత' (ఆటోక్రాటిక్ లీగలిజం- అధికారాన్ని ఏకీకృతం చేసేందుకు, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు స్వస్తిచెప్పేందుకు చట్టపరమైన పద్ధతులను ఉపయోగించడం), 'ఎలెక్టోరల్ టిల్టింగ్' (ఓటింగ్ చట్టాలను మార్చడం, మీడియా కథనాలను నియంత్రించడం తదితర చర్యల ద్వారా వ్యవస్థలను నిజమైన ప్రజాస్వామ్యం కంటే పోటీ నిరంకుశత్వం వైపు కదిలించడం) మొదలైన అప్రజాస్వామిక పాలనా రీతులకు ఉదాహరణలుగా ఉన్నాయి. గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్న పాలకులు, అసమ పోటీ అవకాశాలను కల్పించేందుకు చట్టబద్ధమైన, పాలనా యంత్రాంగాలను ఉపయోగించుకుంటున్నారు. చట్టాలలోను, పాలనా సంస్థలలోను క్రమంగా తీసుకొచ్చిన మార్పులు భారత్‌లో పార్టీ- రాజ్య వ్యవస్థ ఏకీ భవనం (పార్టీ- స్టేట్ ఫ్యూజన్)ను ఎలా సృష్టించాయో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర ఆచార్యుడు తరునాభ్ ఖైతాన్ తన పరిశోధనా పత్రం 'కిల్లింగ్ ఎ కాన్స్టిట్యూషన్ విత్ ఎ థౌజండ్ కట్స్'లో చూపారు. ఈ విశ్లేషణను దేశ్, కాల్, పత్రకు పొడిగిద్దాం. బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఉన్నత బాధ్యతల్లో ఉన్న పెద్ద మనిషి ఒకరు 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రత్యక్ష ప్రసారాలను వీక్షిస్తూ సహజంగానే కలవరపడి ఉంటారు. తమ పార్టీ బలహీనతలు మూడింటిని ఆయన గుర్తించి ఉంటారు. దేశ్- తూర్పు తీరస్థ రాష్ట్రాలలో బీజేపీని వ్యతిరేకించిన ప్రాంతాలు ఉన్నాయిబీ కాల్- ఎన్నికల సమయాలు ఏటా బీజేపీ ఆధిపత్యానికి పరీక్ష పెడుతున్నాయి, పత్ర- సమాజంలో దిగువ స్థాయిలో ఉన్న కొన్ని వర్గాలు బీజేపీకి ఓటు వేసినప్పుడు కూడా ఆ పార్టీని విశ్వసించడం లేదు. ఈ బలహీనతలను అధిగమించేందుకు ఆయనకు ఒక ఆలోచన వచ్చి ఉంటుంది. అది- నియోజకవర్గాల పునర్విభజన, ఒక దేశం-ఒక ఎన్నిక, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణల కలయిక. నియోజకవర్గాల పునర్విభజన (డీ-లిమిటేషన్) బీజేపీకి రెండు ప్రయోజనాలను సమకూరుస్తుంది.

# దక్షిణంలో హోరెత్తించిన సంతకాల సేకరణ ఉద్యమం

### - మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేయండి - దక్షిణ వైసీపీ కార్యాలయం నుండి భారీగా బైక్ ర్యాలీ - జిల్లా కార్యాలయానికి ప్రతులను చేరవేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ పేదల వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను తక్షణమే నిలుపుదల చేయా లంటూ చేస్తున్న సంతకాల సేకరణ ఉద్యమం దక్షిణంలో హోరెత్తించింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం ముమ్మరంగా సాగింది. 14 వార్డులలో కార్పొరేటర్లు వార్డు అధ్యక్షులు సీనియర్ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సహకరించిన 60,000 సంతకాల ప్రతులను ఆశీలమెట్ట వైఎస్ఆర్సిపి కార్యాలయం నుండి వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో జిల్లా పార్టీ కార్యాలయానికి భారీగా బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి పనులు భూస్థాపితం చేయాలన్న చంద్రబాబు కుట్రతో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల వాటికి అనుబంధంగా ఉండే బోధన ఆసుపత్రులలో పేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందదని చెప్పారు. ఇంకా రోగనిర్ధారణ అలాగే ఇన్ పేషెంట్ మెడిసిన్స్‌కి చార్జ్ చేస్తారని ఆరోపించారు. ఇదిలా ఉండగా మరోవైపు రాష్ట్రం పెద్ద సంఖ్యలో మెడికల్ సీట్లు కోల్పోతుందని తెలిపారు. గత ఏడాది 750 ఎంబిబిఎస్ సీట్లు సమకూర్చాల్సి ఉన్న చంద్రబాబు ప్రభుత్వ కక్ష పూర్తి విధానాలతో 700 సీట్లు కోల్పోయామని పేర్కొన్నారు. 2025 – 26 లో 1750 సీట్లు, అలా మొత్తం 2450 మెడికల్ సీట్లు మన పిల్లలు కోల్పోతున్నారని తెలియజేశారు. 1947 నుంచి 2022 వరకు రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కాలేజ్ మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం పి పిపి పేరిట డ్రామాలు ఆడుతోందని ప్రజలకు అర్థమైందని వివరించారు. వైయస్ జగన్ ప్రభుత్వం హయాంలోనూ 7 మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తికాగా అయిదు కాలేజీలో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి అని చెప్పారు. మరో 10 కాలేజీల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నట్లు వెల్లడించారు. వైయస్సార్సీపి ప్రభుత్వం దిగిపోయేసరికి వాటిలో దాదాపు రూ. 3 వేల కోట్ల విలువైన పనులు జరిగినట్లు పేర్కొన్నారు. కొత్త మెడికల్ కాలేజీల కోసం ఏటా రూ. 1000 కోట్ల చొప్పున అయిదు ఏళ్ళు వ్యయం చేస్తే చాలని, కానీ ప్రభుత్వం ఆ దిశలో ఆలోచన చేయకుండా, పిపిపి పేరుతో ప్రైవేటీకరణ పై ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ధ్వజమెత్తారు. వీటన్నిటి నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు కూడా పూర్తిచేసి అన్నిటిని ప్రభుత్వం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోలా గురువులు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా అధ్యక్షులు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, దక్షిణ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవీఎంసీ పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో డి సి (ఆర్) ఎస్.శ్రీనివాసరావు, రెవిన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ మరో 4 నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులతో పాటు పాత బకాయిలను, నీటి చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. కొన్ని జోనల్లో తక్కువగా పన్నుల వసూళ్లు చేస్తున్నారని వాటిపై దృష్టి సారించి పాత బకాయిలను కలుపుకొని పన్నులు వసూళ్ల చేయాలన్నారు. రెవిన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పన్నుల వసూళ్లకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల యొక్క పూర్తి సమాచారం కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించి రోజుకో సచివాలయం పరిధిలోని ఇండ్లను సందర్శించి ఆస్తి, ఖాళీ జాగా పన్నులను వసూలు చేయాలన్నారు. నగరంలో అదనంగా సౌకర్యం కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, జోనల్ కమిషనర్లు, రెవిన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ప్రతి రోజు సౌకర్యం కేంద్రాలను సందర్శించాలని సౌకర్యం కేంద్రాలు సరిగా పనిచేస్తేనే జీవీఎంసీ కి ఆదాయం వస్తుందని కమిషనర్ తెలిపారు.

98 వార్డులలో గల సహాయక ఇంజనీర్లు (వాటర్ సప్లై) ఎమినిటీ కార్యదర్శులను కలుపుకొని పనిచేయాలని రెవెన్యూ ఆఫీసర్లకు ఆదేశించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా ఆస్తి పన్నులు చెల్లించని వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహా విశా ఖపట్నం నగర పాలక సంస్థ యొక్క ఆస్తి పన్నుల చెల్లించేందుకు సిడిఎంఏ వెబ్సైట్ అందుబాటులో వున్నప్పటికీ, జీవీఎంసీ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో పన్నులు చెల్లించే విధంగా ఆస్తి పన్ను చెల్లింపు దారులకు అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. మొండి బకాయిలపై దృష్టి సారించి ఆస్తి పన్నులు చెల్లించని వారిపై చర్యలు తీసుకునేలా జోనల్ కమిషనర్ స్థాయిలో జప్తు నోటీసులు తయారుచేసి బకాయిదారుల భవనాల వద్ద నోటీస్ బోర్డులు పెట్టాలన్నారు. అలాగే ఆస్తి పన్నులు విధించని భవనా లను గుర్తించి వాటికి పన్నులను విధించాలన్నారు. కొన్ని సచివాలయాలలో పరిధిలో జీరో టాక్స్ కలెక్షన్ అవుతుందని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఇంటిని సందర్శించి పన్నులు వసూలు చేయాలని రెవెన్యూ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ సమీక్షలో టెలికాన్ఫరెన్స్ ద్వారా వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నెహ్రూ నగర్ కాలనీలో భారీ తనిఖీలు నిర్వహించిన త్రీ టౌన్ పోలీస్ సిబ్బంది



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉదయం కార్డెన్ చర్చ్‌లో భాగంగా త్రీటౌన్ సీఐ పైడయ్య ఆధ్వర్యంలో భారీ తనిఖీలు నిర్వహించారు. నెహ్రూ నగర్ కాలనీలో గంజాయి మత్తు పదార్థాలు మరియు పాన్ షాప్‌లలో గుట్కా పెట్రోల్ అనుమతులు లేని ఐటమ్స్ ఇల్లీగల్ యాక్టివిస్ పై ఆరా తీశారు. ఆర్ సి బుక్కులు లేకుండా తిరుగుతున్న వెహికల్స్ సీజుడ్ వెహికల్స్ దొంగతనంగా తీసుకొచ్చిన వెహికల్స్ ఏవైనా ఉన్నాయేమోనని కొలనీ వాసులందరినీ అడిగి తెలుసుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ కుమార్ ఎస్సై సురేష త్రీ టౌన్ పోలీస్ సిబ్బంది మరియు కాలనీ వాసులు 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్రం కనకారావు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో త్రీ వీలర్ బ్యాటరీ వాహనం మంజూరు

### - జనసేన నాయకులు ఆధ్వర్యంలో వాహనం పంపిణీ



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రమాదాలు కారణంగా నడవలేని స్థితిలో ఉన్నానని త్రీ వీలర్ వాహనాన్ని సమకూర్చాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వృద్ధుడు చేసుకున్న విన్నపాన్ని నెరవేర్చారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఇటీవల మెంథా తుపాన్ ప్రభావంతో నష్టపోయిన కొబ్బరి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు రాజోలు– శివకోడు పర్యటనకు వచ్చిన రాష్ట్ర డిప్యూటీ సీఎం జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్‌కు తాటిపాకకు చెందిన కొమ్ముల త్రినాథరావు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. తనకు రెండుసార్లు వాహన ప్రమాదాలు జరిగాయని, తనకు ఇళ్లు లేక తాటకు ఇంట్లో నివాసం ఉంటునానని వాహన ప్రమాదం వల్ల నడవలేక ఇబ్బంది పడుతున్నాను మీరు నాకు ఏదైనా వాహనాన్ని ఇప్పించాలని పవన్ కళ్యాణ్‌కు తన సమస్యను విన్నవించుకున్నాడు త్రినాథరావు. పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్‌తో మాట్లాడి త్రినాథరావు బ్యాటరీ వాహనాన్ని అందించాలని ఆదేశించారు. నవంబర్ 26న కొమ్ముల త్రినాథరావు ఇచ్చిన సమస్యపై కలెక్టర్ స్పందించి వెంటనే త్రీ వీలర్ బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేశారు. మంజూరైన వాహనాన్ని జనసేన నాయకులు ఆధ్వ ర్యంలో బుధవారం కొమ్ముల త్రినాథరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పిండి రాజా మాట్లాడుతూ ఒక సామాన్య వ్యక్తి తన సమస్యపై ఇచ్చిన పిర్యాదును వెంటనే స్పందించి త్రీ వీలర్ బ్యాటరీ వాహనంను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ద్వారా మంజూరు చేసి ఇవ్వడం సంతోషంగా ఉందని రాజా, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పేద బడుగు బలహీన వర్గాలకు సేవ చేయడంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎప్పుడూ ముందుంటారని పిండి రాజా కొనియాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు తన పరిస్థితిని, సమస్యను వివరించగా వెంటనే స్పందించి నాకు వాహనాన్ని అందజేసారని పవన్ కళ్యాణ్‌కు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు త్రినాధరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి నాయుడు, పిండి సురేష్, రొక్కల నాగేశ్వరరావు, నాగా సుబ్బారావు, ఐలా నాగేశ్వరరావు, లింగోలు కృష్ణ, దిర్శల చంటి, మోటుపల్లి వీరభద్రరావు, పిండి అక్షయ కుమార్, నిమ్మకాయల నాయుడు, గుత్తుల శివ, తదితరులు పాల్గొన్నారు.

# అప్పులమయంగా మారుతున్న ఆంధ్రప్రదేశ్ : జమ్మలమడక నాగమణి

### - బాబు అంకెల గారడీతో ప్రజలకు బురిడి
### - కాగ్ లెక్కలను తప్పుదోవ పట్టించే ప్రభుత్వ వైఖరి - ప్రభుత్వ భూములను పప్పు
### - బెల్లంలా పంచుతున్న కూటమి సర్కార్



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల బారిన పడేస్తూ ఆర్థిక దిశాహీనతకు గురిచేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె ప్రభుత్వ ఆర్థిక విధానాలపై ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల్లో ప్రభుత్వ భూములు వందల కోట్లకు విక్రయిస్తుంటే, మన రాష్ట్రంలో మాత్రం రూపాయికి వంద రూపాయల విలువ ఉన్న భూములను పప్పు–బెల్లంలా పంచుతున్నారని ఆరోపించారు. దీని వెనుక అధికార కూటమికి ప్రయోజనం దాగి ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆర్థిక పురోగతి అంటూ ఊహాగానాలే మాట్లాడుతున్నప్పటికీ, కాగ్ నివేదికలు మాత్రం రాష్ట్రం ఆర్థికంగా వెనకడుగు వేస్తోందని స్పష్టం చేస్తున్నాయని నాగమణి పేర్కొన్నారు. 2019–2024 మధ్య వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3.31 లక్షల కోట్ల అప్పులు చేస్తే, కూటమి ప్రభుత్వం 18 నెలల్లోనే రూ.2.66 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శిం చారు. సగటున వైసీపీ ప్రభుత్వం నెలకు రూ.5 వేల కోట్లు అప్పు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం నెలకు రూ.15 వేల కోట్ల అప్పు చేస్తోందనీ తెలిపారు. ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోయిందని, 2018–19లో రూ.58 వేల కోట్లు ఉండగా 2023–24లో రూ.93 వేల కోట్ల ఆదాయం మాత్రమే నమోదైందని పేర్కొన్నారు. అంకెల గారడీతో ప్రజలను తప్పుదారి పట్టించడాన్ని ప్రభుత్వం ఆపాల్సిన సమయం వచ్చిందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించడం ఈవీఎంలకు ఛార్జింగ్ పెట్టినంత సులువు కాదని ఎద్దేవా చేశారు.

# మారుతి లిస్ట్‌లో మెగాస్టార్..?



మన శంకర్ వరప్రసాద్, విశ్వంభర ఈ రెండు సినిమాల తర్వాత మెగాస్టార్ చిరంజీవి బాబీ డైరెక్షన్‌లో సినిమా ఒకటి చేస్తున్నారు. ఆ సినిమాను మెగా మాస్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కించాలని బాబీ ప్లాన్ చేస్తున్నాడు. ఈ సినిమాతో పాటు దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో కూడా చిరంజీవి సినిమా ఉంటుందని తెలుస్తుంది. ఐతే మెగాస్టార్ చిరంజీవి ఈ రెండు సినిమాల తర్వాతనే నెక్స్ట్ సినిమా ఏంటన్నది డిసైడ్ చేస్తారట. ఐతే మెగాస్టార్ చిరంజీవి ని డైరెక్ట్ చేయాలని ప్రభాస్ డైరెక్టర్ ఆసక్తిగా ఉన్నాడు. అతను ఎవరో కాదు రాజా సాబ్ డైరెక్టర్ మారుతి. చిన్న సినిమాలతో మొదలు పెట్టి ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో సినిమా చేస్తున్నాడు మారుతి. రాజా సాబ్ హిట్ పడితే అతని ఖాతాలో మరిన్ని సినిమాలు వచ్చి పడతాయి. ఐతే చిరంజీవితో మారుతి సినిమా ఉంటుందనే డిస్కషన్ ఫిల్మ్ సర్కిల్స్‌లో మొదలైంది. మెగా ఫ్యామిలీకి క్లోజ్‌గా ఉండే మారుతి మంచి కథ ఉంటే చేద్దామని మెగాస్టార్ ఎప్పుడో చెప్పారు. ఐతే వెంకటేష్‌తో సినిమా చేసిన మారుతి ఆ తర్వాత మళ్లీ యువ హీరోలతోనే సినిమాలు చేస్తూ వచ్చాడు. ఐతే రాజా సాబ్‌తో రెబల్ స్టార్ ప్రభాస్‌తోనే సినిమా చేసిన మారుతి. నెక్స్ట్ కూడా మరో స్టార్ హీరోతో చేయాలని ఫిక్స్ అయ్యాడు. ఐతే ఈ క్రమంలోనే చిరంజీవితోనే మారుతి ఒక క్రేజీ ప్రాజెక్ట్ చేయాలని ప్లాన్‌లో ఉన్నాడట. ఇప్పటికే మారుతి ఒక స్టోరీ లైన్ కూడా రాసుకున్నాడట. మెగా ఆమోద ముద్ర కోసం వెయిట్ చేస్తున్నాడు. ఐతే అల్లు అర్జున్‌కి చాలా క్లోజ్ అయిన మారుతి పుష్ప రాజ్‌తో ఎప్పుడు సినిమా చేస్తాడా అన్న డిస్కషన్ ఎప్పుడూ ఉంటుంది. ఐతే ఫ్రెండ్ అయినంత మాత్రాన మారుతికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉన్నా సరైన కథ పడితే ఇద్దరు కలిసి రావాలని ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. మారుతి మాత్రం ప్రస్తుతం తన ఫోకస్ అంతా కూడా ప్రభాస్ రాజా సాబ్ మీదే పెట్టాడు. ఆ సినిమా రిలీజ్ తర్వాత నెక్స్ట్ ఏంటన్నది అది ఇచ్చే రిజల్ట్‌ని బట్టి డిసడి చేసేలా ఉన్నాడు. మారుతి మెగాస్టార్ చిరంజీవి ఈ కాంబో సెట్ అయితే మాత్రం చిరంజీవిలోని కామెడీ టైమింగ్‌ని మారుతి పర్ఫెక్ట్‌గా వాడుకునే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. మరి ఈ కాంబినేషన్ అసలు కుదిరే ఛాన్స్ ఉందా లేదా అన్నది త్వరలో తెలుస్తుంది. ప్రభాస్ తర్వాత మళ్లీ యంగ్ హీరోలతోనే మారుతి సినిమా చేసినా ఈసారి పాన్ ఇండియా ఇంపాక్ట్ ఉన్న సినిమా చేయాలని ఆడియన్స్ కోరుతున్నారు. ఎలాగు హీరోలతో సంబంధం లేకుండా సినిమాలు నేషనల్ వైడ్ రిలీజ్ అవుతున్నాయి కాబట్టి మారుతి ఆఫ్టర్ రాజా సాబ్ సినిమా కూడా పాన్ ఇండియా ఉంటుందేమో తెలియాల్సి ఉంది.

# రిసార్ట్‌లో ప్రగ్యా హొయలు.. హాట్ ట్రీట్ కి ఫ్యాన్స్ గుండెల్లో గుబులు



ప్రగ్యా జైస్వాల్.. సినిమాల కంటే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ప్రేక్షకులను అలరించే ఈ ముద్దుగుమ్మ.. ఎప్పటికప్పుడు తన హాట్ ట్రీట్ తో కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టిస్తోంది అనడంలో సందేహం లేదు. ఇందులో భాగంగానే తాజాగా ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి వెకేషన్‌లో భాగంగా ఒక రిసార్ట్ కు వెళ్లిన ఈమె.. అక్కడ తన అందాలతో హాట్ ఫోజులతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోందని చెప్పవచ్చు. తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ ఫోటోలు చూసి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా సీబ్లూ, ఎల్లో కలర్ కాంబినేషన్‌లో షర్టు, షార్ట్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసిన ఈమె.. మరో ఫోటోలో బికినీ అందాలతో ఆశ్చర్యపరిచింది. ఇంకొన్ని ఫోటోలలో షిప్పులో ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేస్తున్న ఫోటోలు అలాగే రిసార్ట్‌లో వారు ఇష్టంగా తీసుకున్న డెసర్ట్ కు సంబంధించిన ఫోటోలను కూడా ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసింది. ఇక ప్రస్తుతం వెకేషన్‌లో ఈమె చిల్ అవుతూ ఎంజాయ్ చేస్తున్న మూమెంట్స్‌కి సంబంధించిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోలలో ప్రగ్యా జైస్వాల్‌ను చూస్తుంటే ఈమె ఏ రేంజ్‌లో వెకేషన్‌ని ఆస్వాదిస్తుందో అర్థం అవుతోంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే ఇలా వెకేషన్స్‌తో తన మైండ్‌ను మరింత రీఫ్రెష్ చేసుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. ప్రగ్యా జైస్వాల్ విషయానికి వస్తే.. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో జన్మించిన ఈమె.. పూణేలోని సింబయాసిస్‌లా స్కూల్లో చదివింది. సింబయాసిస్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు వివిధ రకాల అందాల పోటీలలో పాల్గొని విజయాన్ని అందుకున్న ఈమె.. క్రమంగా మోడల్గా ఎదిగింది. కళా, సంస్కృతి రంగంలో ఈమె సాధించిన విజయానికి 2014 జనవరి 22న సింబయాసిస్ సాంస్కృటిక్ పురస్కారం లభించింది. కాలక్రమేనా మోడల్గా అవతరించిన ప్రగ్యా జైస్వాల్ ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలలో పాల్గొని.. మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ డ్యాన్సింగ్ క్వీన్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ వంటి టైటిల్స్ ను సొంతం చేసుకుంది. మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, డాబర్ వాటిక, ఎఫ్బిబి, రిలయన్స్ డిజిటల్ వంటి పాపులర్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా కూడా పనిచేసింది. మరొకవైపు సినీ రంగంలోకి కూడా అడుగుపెట్టింది ఈ ముద్దుగుమ్మ. 2015లో ఒకేసారి తెలుగు, హిందీ, తమిళ్ భాషలలో చిత్రాలు చేసి సినీ రంగంలోకి అరంగేట్రం చేసింది. అలా 2015లో మిర్చి లాంటి కుర్రాడు అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. క్రిష్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన కంచే సినిమాలో హీరోయిన్గా నటించి భారీ పాపులారిటీ అందుకుంది.

అంతేకాదు ఇందులో ఉత్తమ నటన కనబరిచినందుకు ఈమెకు ఉత్తమ నటి విభాగంలో గద్దర్ అవార్డు కూడా లభించింది. అఖండ, డాకు మహారాజ్ సినిమాలతో ప్రేక్షకులను అలరించింది ఈ ముద్దుగుమ్మ.

# మారుతి మీద రాజా సాబ్ ప్రెజర్..?



రెబల్ స్టార్ ప్రభాస్‌తో సినిమా తీస్తూ కూడా డైరెక్టర్‌కి టెన్షన్ ఉంటుందా అంటే ఉంటుంది. ఎందుకంటే పాన్ ఇండియా స్టార్ తో సినిమా తీసే టైంలో ఎక్స్ పెక్టెషన్స్‌కి రీచ్ అవ్వాలంటే ఆ మాత్రం టెన్షన్ జాగ్రత్త ఉంటుంది కదా. ఐతే ఆ ప్రెజర్‌తో ఆయన కనిపించడం ఫ్యాన్స్ మధ్య డిస్కషన్ పాయింట్ అయ్యింది. ఇంతకీ ఆ డైరెక్టర్ ఎవరు అంటే రాజా సాబ్ మేకర్ మారుతి అని తెలుస్తుంది. మారుతి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న రాజా సాబ్ సినిమా సంక్రాంతికి రిలీజ్ లాక్ అయ్యింది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచింది. ఐతే రాజా సాబ్ సినిమా విషయంలో మారుతి మీద ఇన్షియల్‌గా రెబల్ ఫ్యాన్స్ కాస్త నెగిటివ్ కామెంట్స్ చేశారు. దానికి మారుతి బాగా హర్ట్ అయినట్టు ఉన్నాడు. అందుకే వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రగతి సాధించిన విజయాన్ని గుర్తు చేస్తూ మీరంత ట్రోల్ చేస్తే మేమంత పని చేస్తాం అన్నట్టుగా చెప్పాడు. అంటే రాజా సాబ్‌పై తనకున్న ప్రెజర్‌ని చూచాయగా చెప్పేశాడు మారుతి. మారుతి సినిమా అంటే కంప్లీట్ ఎంటర్టైన్మెంట్ అనే టాక్ ఉంది. మొదట్లో కాస్త యూత్ ఆడియన్స్‌ని ఎట్రాక్ట్ చేయాలని ఏవో ప్రయత్నాలు చేశాడు కానీ తర్వాత మంచి ఎంటర్టైనర్స్ తీస్తూ వచ్చాడు. ఐతే వెంకటేష్‌లాంటి స్టార్‌తో సినిమా తీసిన మారుతి మళ్లీ యంగ్ హీరోలతో సినిమాలు చేస్తూ వచ్చాడు. ఫైనల్‌గా పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్‌తో రాజా సాబ్ ఛాన్స్ రాగానే చాలా ఎగ్జైట్ అయ్యాడు. ఐతే మారుతితో ప్రభాస్ సినిమాను ఫ్యాన్స్ మాత్రం అసలు ఒప్పుకోలేదు.

అందుకే సినిమా సైలెంట్‌గా షూట్ స్టార్ట్ చేసి టీజర్ వదిలారు. ఆఫ్టర్ టీజర్ రిలీజ్ రాజా సాబ్ పై రెబల్ ఫ్యాన్స్ గురి కుదిరింది. అయినా సరే రాజా సాబ్ రిలీజ్ వరకు మారుతి ఆ ప్రెజర్‌ని మెయింటైన్ చేసేలా ఉన్నాడు. ఎందుకంటే ఈమధ్య స్టార్ సినిమాలు రిలీజ్ ముందు రోజు వరకు ట్విస్ట్‌లు తీసుకుంటున్నాయి. అందుకే సంక్రాంతి రిలీజ్ తర్వాత మారుతి సినిమా సక్సెస్‌ని ఎంజాయ్ చేసే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. రాజా సాబ్ ట్రైలర్‌తోనే సినిమా రేంజ్ ఏంటన్నది చూపించాడు మారుతి. ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ కూడా మరో హైలెట్ అయ్యేలా ఉంది. ఈసారి సంక్రాంతికి చాలా సినిమాలు రిలీజ్ ఉండగా ప్రభాస్ రాజా సాబ్ మీద ఎక్కువ ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. పాన్ ఇండియా లెవెల్ లో రాజా సాబ్ క్రేజ్ బాగుంది. సినిమాతో మారుతి కూడా పాన్ ఇండియా డైరెక్టర్స్ లిస్ట్‌లో చేరే ఛాన్స్ ఉందని ఆడియన్స్ నమ్ముతున్నారు.

# సంక్రాంతికి ముహూర్తం.. సంక్రాంతికే రిలీజ్..?



టాలీవుడ్ కింగ్ నాగార్జున నా సామిరంగ సినిమా తర్వాత సోలో సినిమా విషయంలో చాలా జాగ్రత్త పడుతున్నారు. ఎందుకంటే నాగార్జున కెరీర్‌లో అది 100వ సినిమా అవ్వడం విశేషం. ఐతే ఈ ఇయర్ కుబేర, కూలీ సినిమాల్లో స్పెషల్ రోల్స్‌లో కనిపించారు నాగార్జున. కుబేరలో సపోర్టింగ్ రోల్ చేయగా కూలీలో కంప్లీట్ నెగిటివ్ రోల్‌లో ఇంప్రెస్ చేశారు. లోకేష్ కనకరాజ్ సినిమాలో నటించాలనే ఉద్దేశ్యంతో కూలీ సినిమా ఒప్పుకున్నారు నాగార్జున. ఐతే ఆ సినిమాపై ఉన్న అంచనాలను రీచ్ కాలేదు. ఇక నెక్స్ట్ తన సోలో సినిమా కోసం ఫ్యాన్స్‌ని మరీ వెయిటింగ్‌లో పెట్టడం ఇష్టం లేని కింగ్ సినిమా అనౌన్స్‌మెంట్‌కి రెడీ అవుతున్నారని తెలుస్తుంది. 100వ సినిమా సంథింగ్ స్పెషల్ గా ఉండాలనే కారణంతోనే ప్రీ ప్రొడక్షన్ టైంలోనే అంతా సెట్ చేసుకుంటున్నారట. ప్రాజెక్ట్ అనుకున్న విధంగా వస్తుందా రాదా అన్న క్లారిటీ వచ్చిన తర్వాతే అనౌన్స్ చేద్దామనే ప్లాన్ లో ఉన్నారు. తమిళ దర్శకుడు కార్తీక్ తో నాగార్జున 100వ సినిమా చేస్తారని తెలుస్తుంది. ఈ సినిమా స్టోరీ ఏంటన్నది బయటకు రాలేదు. ఐతే నాగార్జున మాత్రం ఈ మూవీని నెక్స్ట్ లెవెల్‌లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారట. సినిమా అనౌన్స్ మెంట్ కూడా త్వరలోనే వస్తుందట. అంతేకాదు 2026 సంక్రాంతికి సినిమా ముహూర్తం పెట్టే ప్లానింగ్ ఉందట. సంక్రాంతికి పూజ చేసి నెక్స్ట్ సంక్రాంతికి రిలీజ్‌కి వచ్చేలా ప్లానింగ్ ఉందట. నాగార్జున సినిమా అంటే ఎంటర్టైనింగ్, యాక్షన్, రొమాన్స్, కామెడీ అన్నీ ఉంటాయి. నాగార్జున పాన్ ఇండియా అటెంప్ట్.. 100వ సినిమా కాబట్టి నాగార్జున కూడా అలానే ప్లాన్ చేస్తున్నారట. సినిమా అనౌన్స్‌మెంట్‌తోనే ఒక గ్లింప్స్ వదిలి మూవీ మీద హై బజ్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఈ సినిమాతో నాగార్జున పాన్ ఇండియా అటెంప్ట్ చేస్తారన్న టాక్ నడుస్తుంది. ఒక డిఫరెంట్ అటెంప్ట్‌తోనే నాగార్జున సెంచరీ సినిమా ఉండబోతుందని తెలుస్తుంది. ఫ్యాన్స్ తో పాటు నేషనల్ లెవెల్ ఆడియన్స్‌ని మెప్పించే కథ, కథనాలు ఇందులో ఉండేలా చూసుకుంటున్నారు. దాదాపు ఏడాదికి పైగా నాగ్ తన 100వ సినిమా పనుల్లో ఉన్నారు. సరైన టైంకి సరైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఈ సినిమా ప్రకటించాలని చూస్తున్నారు. ఐతే నెక్స్ట్ ఇయర్ పొంగల్‌కి ఈ మూవీ సెట్స్ మీదకు వెళ్లే ఛాన్స్ ఉందట. మరి సినిమాపై ఫ్యాన్స్ పెట్టుకున్న ఈ ఎక్స్ పెక్టేషన్స్‌ని సినిమా అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. నాగార్జున స్టోరీ సెలక్షన్ ఎప్పుడూ డిఫరెంట్ గా ఉంటుంది. ఐతే మైల్ స్టోన్ మూవీ కాబట్టి కాస్త ఎక్కువ టైం తీసుకుంటున్నారని తెలుస్తుంది. సినిమా బడ్జెట్ వైజ్ కూడా భారీగా ఉండబోతుందని అంటున్నారు. సో పాన్ ఇండియా రేంజ్‌లో సినిమా ఉండేలా నాగార్జున అండ్ టీం ప్లాన్ చేస్తున్నారట.

# ఘనంగా మానవ హక్కుల దినోత్సవం








**విజయనగరం, (రాజధాని వార్తలు):** మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయ మానవ హక్కుల పాలక సంస్థ మరియు ఎ.బి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ గర్ల్స్ హై స్కూల్‌లో మానవ హక్కుల దినోత్సవాని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎ.ఆర్.దామోదర్ ఐ.పి.ఎస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ 2025 సంవత్సరానికి ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన థీమ్ "మన ప్రతిరోజు అవసరాలు" దీని అర్థం. మానవ హక్కులు కేవలం చట్టపరమైన పదాలు కాదు.అవి మన ప్రతిరోజు జీవనంలో ఉండాల్సిన ప్రాథమిక ఆహారం, నీరు, విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛ, భద్రత, ఇవన్నీ మనకు సహజసిద్ధమైన హక్కులు అని విద్యార్థులకు తెలియజేశారు.మానవ హక్కుల గురించి అవగాహన కల్పించారు. మానవ హక్కుల దినోత్సవం కోసం అనేక విషయాలు విద్యార్థులకు అవగాహన తెలియజేశారు. పోలీస్ శాఖ ద్వారా చేస్తున్న అనేక కార్యక్రమాలపై విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. విశిష్ట అతిథి జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ ఎ.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పిల్లల యొక్క హక్కుల కోసం మరియు వారి హక్కులను ఎలా వినియోగపరుచుకోవాలో విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. మరియు చట్టాల పైన అవగాహన కూడా కల్పించారు. మానవ హక్కుల దినోత్సవం యొక్క ప్రత్యేకతను తెలియజేశారు. మన సమాజంలో ప్రతి ఒక్కరు ఈ హక్కులను అనుభవించగలిగేలా చేయడం మన బాధ్యత. మన హక్కులు కేవలం పుస్తకాలలో ఉండకూడదు.అవి మన ఆచరణలో, మన ప్రవర్తనలో ప్రతిబింబించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎ. బి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్ స్వరూప్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 10వ తేదీన మనం మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటామని 1948వ సంవత్సరంలలో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనను స్మరించుకుంటూ, ప్రతి మనిషికి సమాన హక్కులు, గౌరవం, స్వేచ్ఛ కలగాలని గుర్తు చేస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. మా ట్రస్టు ద్వారా ఇంక ఎంతోమంది పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తానని ఇప్పటికే విద్యార్థులకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మరియు అతిథులు ఈరోజు మనం ప్రతిజ్ఞ చేద్దాం –ఎవరి హక్కులు ఉల్లగించబడిన మనం మౌనంగా ఉండకూడదు. సమానత్వం, గౌరవం, న్యాయం, ఇవే మన సమాజానికి బలమైన పునాది అని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.కార్యక్రమంలో సంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, కోలాటాలు, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, క్రీడలలో గెలుపొందిన విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్స్, మెడల్స్ అతిథుల చేతుల మీదుగా గెలుపొందిన విద్యార్థులకు అందించడం జరిగింది. సంస్థ సభ్యులు వచ్చిన అతిథులు అందరికీ కూడా ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సెక్రెటరీ పాండ్రంకి సంతోష్ కుమార్,సెట్విజ్ సీ. ఈ.వో విశ్వేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ కూరెళ్ళ శ్రీనివాసరావు, సెట్విజ్ మేనేజర్ రమణ, సెయింట్ ఆన్స్ గర్ల్స్ హై స్కూల్ హెచ్ ఎం కవిత సిస్టర్, రాయల్ మెక్ రమణ, రేలా రే రేలా సురేష్, దిశ డి.ఎస్పి, ఎం.ఆర్ కాలేజ్ ఎన్.సీ.సి విద్యార్థులు ఆర్.కె డాన్స్ స్టూడియో విద్యార్థులు అనేక కాలేజ్ & స్కూల్స్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## ట్రక్ షీట్లు వేగంగా జారీ చేయాలి: జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్







**దత్తిరాజేరు/ (విజయనగరం), (రాజధాని వార్తలు):** ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ట్రక్ షీట్లను వేగంగా జారీ చేసి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. ఆయన దత్తిరాజేరు మండలంలో బుధవారం పర్యటించారు. పెదమానాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ సిబ్బంది నిర్వహిస్తున్న కొనుగోలు ప్రక్రియను, తేమ కొలిచే విధానాన్ని పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా వీలైనంత వేగంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీ సత్య మోడర్న్ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రక్‌షీట్లు, గోనె సంచులను పరిశీలించారు. ట్రక్ షీట్లు జారీ ఆలస్యం అవుతోందని గుర్తించి, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సజావుగా మిల్లింగ్ పూర్తి చేసి, సిఎంఆర్ అందజేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మండల తాహసీల్దార్, ఎంపిడిఓ, ఓఎ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కళ్ళు తెరవాలి : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

### - భారీ బైక్ ర్యాలీ - హోరెత్తిన గజపతినగరం







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం తీవ్రతరమైందని, ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత బొత్స అప్పలనరసయ్య అన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తి అయిన సందర్భంగా బుధవారం 60 వేల సంతకాలుతో కూడిన ప్రతులను అంబేద్కర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాల వద్ద ఉంచి, అనంతరం మినీ వ్యాన్‌లో విజయనగరం పార్టీ కార్యాలయానికి ర్యాలీగా తీసుకువెళ్లారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ ఆద్యంతం హోరెత్తింది. ఈ ర్యాలీని బొత్స అప్పలనరసయ్య జండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ఆయన అంబేద్కర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో ప్రభుత్వ నిర్ణయం పట్ల తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరణ చేపట్టామని తెలిపారు. ప్రభుత్వము తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పక్షంలో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జడ్పిటిసిలు గార తౌడు, రౌతు రాజేశ్వరి, వర్రీ నరసింహమూర్తి, ఎంపీపీలు బెల్లాన జ్ఞాన దీపిక, సింహాద్రి అప్పల నాయుడు, చల్ల చల్లమనాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, బొద్దల చిన్నం నాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాశీ పట్టణంలో మూడవ రోజు కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం



**మక్కువ, (రాజధాని వార్తలు):** కాశీపట్నం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం మూడో రోజుకు చేరుతుంది. దీనిలో భాగంగా ఈరోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో ఆజాది అమృత మహోత్సవం కార్యక్రమం చేపట్టారు. స్వాతంత్రం పోరాటంలో పాల్గొని అసువులు బాసిన స్వాతంత్ర సమరయోధుల జీవితాలను మననం చేసుకుంటూ వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో గల పురవీధుల్లో స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలను ఊరేగిస్తూ జోహార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కాశీపట్నం న్యూ కాలనీలో ఇంటింటికి వెళ్లి బహిరంగంగా మలమూత్రాలు దానివల్ల వచ్చే రోగాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డి మంజుల వీణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పొదలకూరులో ఉచిత మెగా వైద్య శిబిరం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజల ఆరోగ్య అవగాహనను పెంపొందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు తరఫున ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 వరకు కాకతీయ డిగ్రీ కాలేజ్, పొదలకూరులో ఈ శిబిరం జరుగింది. ఈ శిబిరంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, హేమటాలజీ & ఆంకాలజీ విభాగాల నిపుణుల ఉచిత కన్సల్టేషన్‌తో పాటు ఎత్తు, బరువు, GRBS., ECG, పాప్స్మియర్ (స్త్రీలకు), డాక్టర్ కన్సల్టేషన్ వంటి పలు పరీక్షలు నిర్వహించినారు. డా.పి.విజయ్ కుమార్, సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజిషియన్ & డయాబేటాలజిస్ట్ మాట్లాడుతూ, "హృదయ వ్యాధులు చాలాసార్లు లక్షణాలు కనబరచకుండానే అభివృద్ధి చెందుతాయి. అందుకే చిన్న చిన్న మార్పులనైనా సీరియస్‌గా తీసుకుని సమయానికి పరీక్షలు చేయించుకోవాలి. ఈ శిబిరం ప్రజలకు ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించే గొప్ప అవకాశం," అన్నారు. డా. మౌనిక రెడ్డి వై, కన్సల్టెంట్ మెడికల్ & హెమాటో ఆంకాలజిస్ట్, బి.యమ్.టి. ఫిజిషియన్ మాట్లాడుతూ,"రక్త సంబంధిత క్యాన్సర్లు మరియు ఇతర క్యాన్సర్లు ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ఫలితాలు చాలా మంచిగా ఉంటాయి. అలసట, రక్తహీనత, తరచూ ఇన్‌ఫెక్షన్లు, కారణం లేని బరువు తగ్గడం వంటి చిన్న లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఇలాంటి ఉచిత శిబిరాలు ప్రజల్లో అవగాహన పెంచి ప్రాణాలను కాపాడుతాయి," అని పేర్కొన్నారు. అనంతరం కాకతీయ కాలేజీ విద్యార్థులకు క్యాన్సర్, పలు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్, డాక్టర్ పి రాశి రెడ్డి, జనరల్ ఫిజిషియన్ పాల్గొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు, ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకొని తమ ఆరోగ్యం గురించి సమగ్రంగా తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది. సంప్రదించండి: 040 6833 4455.

## సేకరించిన సంతకాల పత్రులను జిల్లా కేంద్రానికి పంపించిన భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్





**తగరపువలస, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన కోటి సంతకాల పత్రాలను విజయనగరం జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను తన కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిమ్మ భీమిలి నియోజవర్గంలో పత్రిక సమావేశం నిర్వహించి సేకరించిన సంతకాలు పత్రాలను తగరపువలస అంబేద్కర్ కూడలి నుండి వైయస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడినుండి జిల్లా కేంద్రానికి సంతకాల పత్రాలను తరలించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని ఉన్న పార్టీ యస్ఈసీ మెంబర్లు, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా మరియు మండల పార్టీ కమిటీలలో వివిధ హోదాలో గల సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# బైక్ ర్యాలీగా బయలుదేరి 65 వేల సంతకాల సేకరణ పత్రాలు అందజేత



**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 65 వేల సంతకాల సేకరణ పత్రాలను పి.గన్నవరం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దనుండి బైక్ ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డికి మాజీ మంత్రి వర్యులు పార్లమెంట్ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ స్వగృహం వద్దకు చేరుకొని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి. గన్నవరం పరిశీలకులు చింతలపాటి శ్రీనివాస రాజు వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మరియు జిల్లా నాయకులు, ఎంపీపీలు, సర్పంచులు, జడ్పిటిసిలు ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డ్ మెంబర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, సోషల్ మీడియా కార్యకర్తలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేశారు.

# ఎండాడ జాతీయ రహదారిపై బస్సు ఢీకొని జింక మృతి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఎండాడ జాతీయ రహదారిపై బస్సు ఢీకొని జింక మృతి చెందింది కంబాలకొండ నుంచి జింకలు తరచుగా రోడ్డుపైకి వస్తుంటాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం జింక రోడ్డుపైకి ఆకస్మికంగా రావడంతో, అటుగా వస్తున్న బస్సు ఢీకొంది. జింక అక్కడికక్కడే మృతి చెందింది కంబాలకొండ అడవి నుంచి ఇలా రోడ్డెక్కిన జింకలు తరచుగా ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలు లేదా మరణం సంభవిస్తున్నాయి. మృతదేహాన్ని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం : మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కస్తూరిబా గాంధీ హైస్కూల్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ విజయ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ,న్యాయము కోసం పోరాటం చేయగలుగుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నరసాపురం వాసులకు గుడ్ న్యూస్.. 'వందే భారత్' రైలు పొడిగింపు

**చెన్నై:** చెన్నై సెంట్రల్-విజయవాడ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు తాత్కాలికంగా పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.20677 చెన్నై సెంట్రల్-నరసాపురం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి జనవరి 11వ తేది వరకు చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి 7.05 గంటలకు రేణిగుంట, 8.29 గంటలకు నెల్లూరు, 9.43 గంటలకు ఒంగోలు, 11.08 గంటలకు విజయవాడ, మధ్యాహ్నం 12.29 గుడివాడ, 1.14 గంటలకు భీమవరం టౌన్, 2.10 గంటలకు నరసాపురం చేరుకుం టుంది. మరుమార్గంలో, నెం.20678 నరసాపురం-చెన్నై సెంట్రల్ వందే భారత్ ఈ నెల 17 నుంచి జనవరి 11వ తేది వరకు నరసాపురంలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి 3.19 గంటలకు



భీమవరం టౌన్, సాయంత్రం 4.04 గంటలకు గుడివాడ, 4.50 గంటలకు విజయవాడ, 6.29 గంటలకు ఒంగోలు, రాత్రి 7.39 గంటలకు నెల్లూరు, 9.50 గంటలకు రేణిగుంట, 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

# జిల్లాలో నాలుగు ఇసుక రీచ్‌లకు టెండర్లు

**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అత్యంత పారద ర్శకంగా జవాబుదారీతనంతో నిర్వహించడానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీ పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, కమిటీ చైర్మన్ ఆర్ మహేష్ కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుక పాలసీ టెండర్ల ప్రక్రియ,కొత్త ఇసుక రీచ్‌లు, అప్రూవల్, కొత్త ఇసుక రీచులకు టెండర్ నోటిఫికేషన్ జారీ వంటి అంశాలపై సమీ క్షించారు. జిల్లాలో నాలుగు సెమీ మేకనైజడ్ రీచ్‌లకు టెండర్లు ప్రక్రియ ఈనెల 12 నుండి నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వీటిలో మెర్ల పాలెం, కపిలేశ్వరపురం, ఆలమూరు, జొన్నాడ రీచులు ఉన్నాయన్నారు. టెండర్‌దార్ల నియమ నిబంధనలు, అర్హతలు, సాంకేతిక క్యాబబులిటీ, వార్షిక ఆదాయ విధానాలు, లైసెన్సులు వాటిపై సమీక్షించి తగు సూచనలు చేశారు. స్టాక్ యార్డులు లీజు అంశాలపై తాసిల్దార్లతో సర్టి ఫికేషన్ చేయిం చాలని సూచించారు. అలాగే లీజుదారుల నో అబ్జెక్షన్ ధ్రువపత్రాలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏటిగట్లపై ఇసుక లోడుతో రాకపోకలు రవాణాను నిర్వ హించకుండా జలవనరుల శాఖ నిఘా ఉం చాలన్నారు. ప్రయాణం దూరం తగ్గుతుందనే ఉద్దే శంతో ఏటిగట్లపై ఇసుక లోడుతో రాకపోకలు సాగిస్తారని తద్వారా ఏటిగట్లు బలహీనపడే అవకా శం ఉ ంటుందన్నారు. ప్రతిపాదిత నిర్దేశిత మార్గాల లోనే ఇసుక రవాణా జిపిఎస్ కోఆర్డినేట్స్‌తో నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్లు బ్రిడ్జిలు వంతెనల సామర్థ్యం మేరకు మాత్రమే వాహనాలు రాకపోకలు నిర్వహించాలన్నారు. ఈ నెల 12వ తేదీన ఈ నాలుగు రీచులకు టెండర్లు స్థానిక కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఛాంబర్‌లో ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు టెండర్లు దాఖలు చేయవచ్చునని 18వ తేదీ టెండర్లు పరిశీలన అనంతరం అర్హత సాధించిన టెండర్ దారుల పేర్లతో తుది జాబితా ప్రకటన ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనులు భూగర్భ శాఖ ఎల్ వంశీధర్ రెడ్డి, గోదావరి హెడ్ వర్క్స్ కార్య నిర్వాహక ఇంజనీర్ జి శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి డి శ్రీనివాసరావు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ కో ఆర్డినేటర్ సువిజయ్, జిల్లా గ్రామీణ త్రాగు నీటి సరఫరా పారిశుధ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఏవీఎస్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# సత్య డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ మరియు ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం మహోత్సాహంగా నిర్వహించారు. కాలేజీ విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి తమ మానవతా విలువలను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాలసంచాలకు డాక్టర్ ఎం శశి భూషణ రావు మాట్లాడుతూ రక్తదానం వంటి మహత్తర సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొనడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. యువతలో సేవాభావం పెంపొందించడం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ లక్ష్యమని, ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు సంవత్సరం పొడుగున ఎక్కడ రక్తం అవసరమయిన వెళ్ళి దానం చేస్తున్నారని ఈ క్యాంపులో కూడా 63 మంది రక్త దానం చేశారని, అందులో ఎన్ సి సి బాలురు మరియు బాలికలు కూడా రక్త దానం చేశారని ఈ విధంగ రక్తందానం చేయగల అర్హత ఉన్నవారు తప్పనిసరిగా దానం చేస్తే మన దేశంలో రక్త నిల్వ కొరత ఉండకుండా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు అని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రోత్సాహకంగా బహుమతులు అందజేయడం విశేషం. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి సూరప నాయుడు విద్యార్థి సమన్వయకర్తలు కృషిని ప్రిన్సిపాల్ మరియు సంచాలకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కే.ఆర్.డి.ప్రసాద్ రావు, ఏ పి ఆర్ డి ఎం.రాము, డాక్టర్. దేవీ వర ప్రసాద్, స్టాఫ్ లక్ష్మీ మరియు ప్రసాద్, హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ఎం.సాయి కుమార్ మరియు ఆర్.అశోక్ పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి పోలమ్మ 49వ వార్షికోత్సవ మహోత్సవంలో ముఖ్య అతిథిగా మన సిరమ్మ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలో సుద్ద వీధిలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి పోలమ్మ 49వ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్.సీ.పీ.జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి పోలమ్మ పండుగకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం బొబ్బిలి పోలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు సిరమ్మకు స్వాగతం పలికారు. తదనంతరం సురమ్మ గుడి పూజారి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బొబ్బిలి పోలమ్మ 49వ వార్షికోత్సవ మహోత్సవంలో పాల్గొన్న సిరిసహస్ర

**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలో సుద్ద వీధిలో కొలువైన శ్రీశ్రీశ్రీ బొబ్బిలి పోలమ్మ 49వ వార్షికో త్సవ మహోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్.సీ.పీ.జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి పోలమ్మ పండుగకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం బొబ్బిలి పోలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు సిరమ్మకు స్వాగతం పలికారు. తదనంతరం సిరమ్మ గుడి పూజారి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్ర



మంలో కమిటీ సభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ఆధ్వర్యంలో వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# కోటి సంతకాల సేకరణ పూర్తి చేసి పత్రాలను కేంద్రానికి పంపించిన చిన్నశ్రీను



**భీమిలి, (రాజధాని వార్తలు):** భీమిలి నియోజవర్గంలో సేకరించిన సంతకాలు పత్రాలను జిల్లా కేంద్రానికి పంపించారు. ఈరోజు వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కళాశా లను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాలు సహకరణ కార్యక్రమం పూర్తయింది. ఇందులో భాగంగా విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను మరియు తన కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర భీమిలి నియోజకవర్గంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేకరించిన సంతకాలు పత్రాలను తగరపువలస అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి వైయస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడినుండి జిల్లా కేంద్రానికి సంతకాల పత్రాలను తరలించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని ఉన్న పార్టీ SEC మెంబర్లు,రాష్ట్ర పార్టీ కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా మరియు మండల పార్టీ కమిటీలలో వివిధ హోదాలో గల సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్శిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్శిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎల్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లూబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అభివృద్ధి మండలంగా డక్కిలి : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ










**డక్కిలి, (రాజధాని వార్తలు):** డక్కిలి మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా భూ సమస్యలు పరిష్కరించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం హయాంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, భూ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేశారని, కొన్నిచోట్ల భూములు అన్యాక్రాంతం జరిగిందన్నారు. ఇకపై ఎక్కడ ఆక్రమణలు, దొంగ రికార్డులు, భూ సమస్యలు ఉండకూడదని వెంటనే అధికారులు భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. అసైన్మెంట్ భూములుకు త్వరలో ఫ్రీ హోల్డ్ అమలు చేస్తామని, మరొకసారి రికార్డును పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. డక్కిలి మండలానికి నవోదయ స్కూలు మంజూరు అయిందని దీనితో డక్కిలి మండలం విద్య హబ్బుగా మారుతుందన్నారు. మరొకపక్క మండలానికి పశువులు హాస్టల్ మంజూర అయిందని అందుకోసం భూమిని పరిశీలిస్తున్నామన్నారు. వివిధ సమస్యల కోసం ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే వాటిని పరిశీలించి వారితో మాట్లాడి మీ సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని వారికి హామీ ఇవ్వడమే గాక అధికారులు ప్రజా సమస్యల పట్ల వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రబాబు, డక్కిలి మండలం టిడిపి అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వర్ రెడ్డి, మాధవయ్యపాలెం సొసైటీ అధ్యక్షులు రామచంద్ర నాయుడు, ఎంపీపీ గొను రాజశేఖర్, సుధీర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# నెల్లూరులో వైట్ గోల్డ్ నూతన బ్రాంచ్ ప్రారంభం










**నెల్లూరు అర్బన్, (రాజధాని వార్తలు):** స్థానిక వేదాయపాలెం సెంటర్ దగ్గర వైట్ గోల్డ్ బులిటిన్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన కార్యాలయాన్ని సింహపురి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈ నూతన ప్రారంభోత్సవ క్లస్టర్ మేనేజర్ ఆనంద్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రోజురోజుకి పెరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆయా సందర్భాన్ని బట్టి తప్పనిసరిగా బంగారాన్ని కుదవ పెట్టి తమ అవసరాలను తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ క్రమంలో తీసుకున్న అప్పు తీర్చకపోగా, వినియోగదారులు కుదువబెట్టిన బంగారం తిరిగి పొందేందుకు వీలులేని పరిస్థితిలో ఆయా కంపెనీలు కుదువ పెట్టిన బంగారాన్ని అసలు వడ్డీతో కలిపి తీసుకోలేని పరిస్థితులు సామాన్య కుటుంబాలలో ఎదురవడం సహజమేనన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు కుదువ బెట్టిన బంగారాన్ని విడిపించి ఏ రోజుకు ఆ రోజు నూతన బంగారం రేట్లతో సరిపోలుస్తూ వైట్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, తాకట్టు నుండి విడిపించి సరసమైన రేట్లుకు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంలో వినియోగదారుల వద్ద ఉన్న బంగారం క్యారెట్‌ను బట్టి బంగారం ధర నిర్ణయించి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకుగాను వినియోగదారుల నుండి సర్వీస్ లో ఖర్చుల కింద సాధారణ ఫీజులు వసూలు చేయబడతాయని తెలిపారు. నూతనంగా ప్రారంభించబడిన వైట్ గోల్డ్ బులిటిన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను సింహపురి ప్రజలు సందర్శించి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ ఆఫ్ సేల్స్ మిథున్ శెట్టి, క్లస్టర్ మేనేజర్ ఆనంద్, మార్కెట్కి మేనేజర్ సునీల్ మరియు నెల్లూరు బ్రాంచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయినవిల్లిలో మొసలి సంచారం

**అయినవిల్లి, (రాజధాని వార్తలు):** అయినవిల్లి లంక అబ్బాయి కాపు ఇసుక బట్టి గోతులో మొసలి సంచారం ఫోటోలు వైరల్‌గా మారాయి. చేపలు వేటకు వెళ్లిన మత్స్యకారులకు మొసలి సంచారు. కనిపించినట్లుగా మత్స్యకారులు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan